స్కెచ్

# గోదావరి వేసిన ప్రశ్న

నిట్టల శ్రీరామమూర్తి

ప్రశాంతంగా, నిండు ప్రవాహంతో, ఒడిదుడుకులు లేకుండా సాగిపోతోంది గోదావరి. దాన్ని ఆనుకునే వుంది ఆ వూరి రామాలయం, ప్రక్కనే రచ్చబండ, పైన రావిచెట్టూ వినీలాలాకాశం క్రింద బంగారు ఎండ కాంతితో మెరుస్తూ మెదుల్తున్నాయి. లేతాకు పచ్చని రావి ఆకులు. రచ్చబండమీద చర్చలు సాగుతున్నాయి.

"ఈసారి పండక్కి భామా కలాపం పెట్టిద్దాం" అన్నాడు భీమయ్యకాపు.

"ఏం కలాపమో మొన్న! కాపులవీధికి రోడ్డు వేయించేసరికే బోలెడంతయింది. ఎందుకొచ్చిన ఖర్చులు పోనిద్దూ" అన్నాడు సంగయ్య నాయుడు.

"అదేంటి సంగయ్యా దానికీ రోడ్డుకీ సంబంధమేమిటి. చందాలు వసూలుచేస్తే యిట్టే అయిపోతుంది" అన్నాడు భీమయ్య ఆరినచుట్ట అవతల పారేస్తూ.

"అందరూ చందాలు ఇచ్చుకోవద్దూ. నీకేం కబుర్లు చెప్తావు" అన్నాడు సంగయ్య బావమరిది కొడుకు రత్తయ్య.

"ఇచ్చుకో లేకపోతే మానెయ్యవోయ్ చందాలిచ్చుకునేవాళ్ళే వస్తారు చూడ్డానికి" అన్నాడు హేళనగా భీమయ్య.

"మాకామాత్రం స్తోమతులేకపోలేదు భీమయ్యా వూళ్ళో కొందరిగురించి చెప్పాడు" రత్తయ్య 'అంతే' అని హెచ్చరించాడు సంగయ్య గిరజాలు సవరించుకుంటూ.

"ఎవరి సంగతి వాళ్ళు చెప్పండోయ్ మిగతా వాళ్ళ గొడవ మీకెందుకు" అన్నాడు చురుకు పాలు చుక్కయ్య. (భీమయ్య మొదటి భార్య కొడుకు.)

"ఎలాగయితేనేం మీ వీధికే రోడ్డు పడింది కదా అని మహ మురిసిపోతున్నారు. అంత సరదాగా వుంటే నీ సొమ్ముతోనే పెట్టించకూడదా యేమిటి?" అంటూ అందుకున్నాడు రత్తయ్య.

"మా వీధికి రోడ్డు పడిందని ఏడవకపోతే మీరూ వేయించుకోకూడదా యేమిటి" అన్నాడు చుక్కయ్య.

"మాటలు జాగ్రత్తగా రానియ్యవోయ్ చుక్కయ్యా" అన్నాడు సంగయ్య చుట్ట ముట్టిస్తూ.

"ఏంచేస్తా వేమిటి? ఎదుటి మనుష్యుల్లో మర్యాదుంటే మాటలు జాగ్రత్తగా వస్తాయి" అన్నాడు భీమయ్య.

"మీ యిష్టంవచ్చినట్లు చేసుకోండి మధ్యని నాకెందుకు" అని కరుగ్గా అంటూ కండువా భుజం మీదికివేసుకుని వెళ్ళిపోయాడు సంగయ్య.

"అబ్బో యీమాత్రానికే బెదిరిపోతాడా మా భీమయ్యకాపు! భామా కలాపం ఆడితీరాల్సిందే. ఏమంటావు భీమయ్య మావా" అన్నాడు మంగయ్య.

"అంతే" అంటూ మీసం మెలివేశాడు భీమయ్య కాపు.

ఎవరిదారినివారు వెళ్ళిపోయారు. గోదావరి ప్రశాంతంగా ప్రవహిస్తూనేవుంది. రావి ఆకులు రెపరెపలాడుతూనే వున్నయి.

కాని ఆ సాయంత్రం జరిగిన ఆ అరగంట చర్చతో గ్రామంలో మనస్పర్థలు రవుల్కున్నాయి. ఆ రోజు సంగయ్య విసురుగా అలా వెళ్ళిపోడం భీమయ్యకి తనని అవమానంచేసినట్లనిపించింది. భీమయ్యకాపు బెదిరింపులు సంగయ్య మోతుబరీతనానికి నామోషీ అనిపించింది. ఆ ఇద్దరికీ తగిన ప్రతీకారంచేసి పదిమందిలో తమ తల నిలబెట్టుకోవాలనే పట్టుదల రేగింది. భామా

కలాపం జట్టువారు దిగిన పాకకి ఎవరో నిప్పు అంటించారు' ఆరాత్రే కరణంగారి అరుగుమీద సంగయ్యా పోటీగా పెట్టించిన హరికథ జరుగుతూంటే ఎవరో రాళ్లువిసిరేరు. భీమయ్యదూడల్ని సంగయ్యబందులు దొడ్లోకి తోలిస్తే రామయ్యా కాపు సంగయ్యపైచేసిన దావాగ్రంథం యావత్తూ భీమయ్యే నడిపిస్తున్నాడు.

అంతకంతకి రోషాలు పెరిగేయి, ద్వేషాలు మోపుఅయ్యేయి. కాపులవీధికీ కరగాలవీధికీ పొసగటంలేదు. రామయ్య దావాలో సాక్ష్యం ఇచ్చి ఇంటికివస్తూన్న భీమయ్యకి రచ్చబండమీద నవ్వుమొహంతో కూర్చున్న సంగయ్య (ఎవరి ఖర్మో కోకోలో) తన్నుచూసి అపహాస్యం చేస్తున్నాడని అనుమానంవేసింది.

గోదావరి నిర్మలంగా సాగిపోతోంది. ఇటు గ్రామం పంచాయతీ ఎలక్షన్లతో ఉడుకెత్తిపోయింది. భీమయ్యా సంగయ్యా చెరో ప్రక్కల నిలబడ్డారు. డబ్బ విచ్చలవిడిగా ఆవూరి వీధుల్లో ప్రవహించింది. చెరో ఐదువేలూ ఖర్చయ్యాయి; చివరికి సంగయ్యే నెగ్గాడు.

"చూద్దాంగా ఏమాత్రం వెలగబెడతాడో ప్రెసిడెంటుగిరీ" అన్న భీమయ్య మాటలు వినకపోలేదు సంగయ్య. ఎలక్షన్లు అయి నెలతిరక్కుండా సంగయ్యపై ఫిర్యాదులు వెళ్ళేయి. పట్టుదలలు పెరిగి రెండు పార్టీలవారూ దొమ్మీకి దిగుతుంటే గోదావరి పెరిగింది. ఉన్నట్టుండి అనుకోకుండా ఒక్కరాత్రిలో పొంగిపొర్లింది. అంతకు ముందెన్నడూ కనివినిఎరగని ప్రచండవేగంతో ఉరకలు వేసుకుంటూ నురగలు క్రక్కుతూ మిన్నూ మన్నూ ఏకమయేట్టు ఉవ్వెత్తుగ లేచింది గోదావరి ఏటిగట్టు తాకుతూ. ప్రక్కలికి ఏదివచ్చినా విపరీతమే. గోదావరికి కోపం వచ్చింది. ప్రశాంతంగా సాగిపోయే ప్రవాహం ప్రళయభీభత్స స్వరూపిణిగా తయారైంది. కనిపించిందల్లా తుడిచిపెట్టుకుపోయింది గోదావరి విసురు. ఊరంతా నీటిమయం. చాలా కొంపలు కూలిపోయాయి, కట్టుబట్టల్తో గ్రామప్రజ ఏటిగట్టు చేరుకుంది. నిన్నటివరకూ తమకేమీ భయంలేదనే నిర్విచారంతో హాయిగా గుండెలు మీద చేతులు వేసుకుని నిద్రించిన పెద్దమనుషులు మర్నాటికి ఆస్తిపాస్తులూ కొంపాగోడూపోయి అనాథలై కట్టుబట్టలతో గట్టు చేరుకున్నారు.

గట్టుమీదే నించున్నారు సంగయ్యా, భీమయ్యానూ. ఇద్దరికీ ఒకటే ఆలోచన ముంచెత్తే ఈ ప్రమాదాన్ని తప్పించుకోవడమెలాగా అని. ఆగర్భ శత్రులకి కూడా ఓ ఎడారిలో దాహంతో తపిస్తున్నపుడు, ఓ మహోన్నత శిఖరంపై నిస్సహాయంగా వుండిపోయినపుడు, ఓ కీకారణ్యంలో దారితెన్నూ లేకుండా తిరిగేటప్పుడు ఒకే ఆలోచన కలుగుతుంది. "తోటిమానవులం మనం బ్రదకట మెలాగా" అని. ఆఆలోచనే యిద్దర్నీ సన్నిహితుల్ని చేసింది. "చూస్తావేమిటి సంగయ్యా పార అందుకో"అన్నాడు భీమయ్య నడుం బిగించుతూ. "పదండిరా" అంటూ కేకేసి రంగంలోకిదిగేడు సంగయ్య. వూరి ప్రజంతా ఒక్కటై మట్టితవ్వి ఏటిగట్టు ఎత్తుచేస్తున్నారు. ఆ గండిపడితే సర్వనాశనమైపోతుందని అందరికీ తెలుసు. అందరికీ ఒకటేదృష్టి. ఒకటేలక్ష్యం. అహోరాత్రులు విధివిరామం లేకుండా చెమటోడ్చి ప్రాణాలుతెగించి ఒక్కుమ్మడిగా పనిచేసింది ఆ ప్రజ. భీమయ్య కూతురు యిచ్చిన మంచినీళ్లు సంగయ్యత్రాగాడో, సంగయ్యభార్య తెచ్చిన చద్దికూడు భీమయ్యతిన్నాడో ఎవరూపట్టించుకోలేదు. అభిమానాలూ, అహంకారాలూ,దురాశలూ, పట్టుదలలూ అన్నీ తుడిచిపెట్టుకు పోయాయి.

గోదావరి మూడోరోజుకి వరద తీసింది. ఏమీ ఎరగనట్లు అమాయకంగా ప్రశాంతంగా గోదావరి ప్రవహిస్తూనేవుంది. పారా తట్టా క్రింద పడేసి ఆయాసంతో వగరుస్తూ నుదుటి చెమట తుడుచుకుంటూ ఏటిగట్టుమీద నిలబడ్డారు సంగయ్యా భీమయ్యానూ. అప్రయత్నంగా ఇద్దరూ ఒకసారే అన్నారు.

"ఎప్పుడూ మనం ఇల్లా స్నేహంగా ఎందుకుండకూడదూ?"

గోదావరీ అదే ప్రశ్నిస్తోంది. దీనికిసమాధానం ఎవరు చెప్పగలరు?